క్లుప్తంగా

సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



వేల్పూర్: సీఎం కప్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు మోతె హైస్కూల్ విద్యార్థి వేదాంశ్ ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ సురేశ్‌కుమార్ గురువారం పేర్కొన్నారు. ఈనెల 27 నుంచి 29 వరకు మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించే సీఎం కప్ పోటీల్లో పాల్గొంటాడని అన్నారు. తమ స్కూల్ విద్యార్థి సీఎం కప్ పోటీలకు ఎంపిక కావడంపై హెచ్‌ఎం గణేశ్, పీడీ సురేశ్‌కుమార్, కబడ్డీ కోచ్ పరంజ్యోతి, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం



మాక్లూర్: పార్లమెంట్‌లో అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్రమంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను గురువారం మాక్లూర్ మండలంలోని మాణిక్‌బండార్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు దహనం చేశారు. కార్యక్రమంలో రవిప్రకాశ్, బూరోళ్ల అశోక్, గంట చిన్నయ్య, పురషోత్తం, గుండారం శేఖర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాగర్ కాలువపై కబ్జాలు తొలగించాలి

రుద్రూర్: కోటగిరి శివారులోని నిజాంసాగర్ కాలువపై కబ్జాలు తొలగించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం వారు కబ్జా ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కాలువ బౌండ్రీని కబ్జా చేస్తుంటే ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేశారు. కాలువ సరిహద్దులు లేకుండా పూడికతీత ఎలా చేపడతారని ప్రశ్నించారు. సంబంధిత అధికారులు స్పందించకపోతే రైతులతో కలిసి ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని మేరు సంఘం భవనంలో గురువారం మేరు సంఘం నూతన క్యాలెండర్‌ను అధ్యక్షుడు రాజుల దేవి రవినాథ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేరు కులస్తుల అందరి సహకారంతో గత ఐదేళ్ల నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. మేరు కులస్తులు అన్ని రంగాల్లో ముందుండాలని సూచించారు. కార్యక్రమంలో కొట్టూరు సుదర్శన్, రాజుల దేవి వసంత్, పాల్కం నారాయణ, దీకొండ లక్ష్మణ్, సంగ్వి గంగాధర్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కార్మికులకు దుప్పట్ల పంపిణీ



వర్ని: మండల కేంద్రంలో గురువారం మాదాల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్మికులకు, నిరుపేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. మండలంలోని ఐదు జీపీలకు చెందిన కార్మికులకు, వర్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు దుప్పట్లతోపాటు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ మేనేజర్ ఠాగూర్, నగేశ్, కృష్ణ, కనకరాజు, సుబ్బారావు పాల్గొన్నారు.

భూమిపూజ



బోధన్‌రూరల్: పట్టణంలోని శ్రీచక్రేశ్వర శివాలయంలో భక్తుల వసతి కోసం నిర్మించిన గదుల పనులకు గురువారం ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పూజలు నిర్వహించి ప్రారంభించారు. కార్యక్రమంలో సభ్యులు హరికాంత్ చారి, లక్ష్మణ్, భూమేశ్, లింగం, డీసీసీబీ మాజీ చైర్మన్ గంగాధర్ పట్వారీ తదితరులు పాల్గొన్నారు.

జనవరి 9న డిమాండ్స్ డేగా నిర్వహించాలి

నిజామాబాద్ సిటీ: ఇండియా ప్రొగ్రెసివ్ కిసాన్ సభ, సొదో, అసోం, బైటియాక్ సంత, త్రిపుర కృషక్ ముక్తి సంగ్రామ్, ఆలిండియా కాంత్రికారి కిసాన్‌సభలు కలిసిపోయి 'ఆలిండియా యునైటెడ్ కిసాన్ సభ'గా రూపాంతరం చెందినట్లు ఏఐయూకేఎస్ ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ గురువారం పేర్కొన్నారు. జనవరి 9న డిమాండ్స్ డే జరపాలని నిర్ణయించినట్లు తెలిపారు. సాగుచేసిన రైతులకు రైతు భరోసా, అర్హులకు తెల్ల రేషన్‌కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కూలీలకు రోజుకు రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు సర్వర్ ప్రాబ్లం

- సాంకేతిక అడ్డంకులతో ఇబ్బందులు పడుతున్న అధికారులు
- ఈ నెల 31 లోపు సర్వే పూర్తయ్యేనా..?



ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజు(ఫైల్)

ఆర్మూర్‌టౌన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా చేస్తున్న ఇంటింటి సర్వేకు సాంకేతిక అడ్డంకులు తప్పట్లేదు. సాంకేతిక సమస్యతో ఒక్కో సర్వేయర్ రోజుకు కనీసం 15 ఇళ్లు చేయడమే గగనంగా మారింది. నెలాఖరు వరకు ప్రభుత్వం సర్వేను పూర్తి చేస్తామన్న అధికారులు ప్రకటించగా.. ప్రస్తుతం తలెత్తుతున్న సమస్యలతో గడువు పెంచక తప్పని పరిస్థితి నెలకొంది.

రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన అర్హులను గుర్తించి యాప్‌లో నమోదు చేసే ప్రక్రియ కొనసాగుతోంది. ప్రజాపాలన, సమగ్ర సర్వేలో ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను ఇందిరమ్మ ఇండ్ల కోసం ప్రభుత్వ తీసుకొచ్చిన యాప్‌లో సర్వేయర్లు నమోదు చేస్తున్నారు. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 3,20,831 మంది దరఖాస్తు చేసుకున్నారు. అలాగే ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని 36 వార్డుల్లో 11,402 మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. కాగా ప్రభుత్వం తొలి విడదల ప్రతి నియోజకవర్గానికి 3500 మంది అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు కేటాయించనున్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో 36వార్డుల్లో 36 సర్వేయర్లు, ఆరుగురు సూపర్‌వైజర్ల సమక్షంలో ఇందిరమ్మ ఇళ్ల వివరాలను సేకరించి యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఈ సర్వేలను కలెక్టర్ నుంచి మున్సిపల్ అధికారుల వరకు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ప్రతిరోజు సర్వేయర్లు దరఖాస్తుదారుల ఇంటివద్దకు వెళ్లి సంబంధిత వివరాలను సేకరిస్తున్నారు. ఇంటివద్ద ఖాళీ స్థలం ఉంటే లబ్ధిదారుల ఫొటోలు తీసి మొబైల్ యాప్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేస్తున్నారు. యాప్‌లో పొందుపరిచిన వివరాలు ఆధారంగా చివరకు అర్హులైన వారిని ఎంపిక చేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

15 ఇళ్లు చేయడమే గగనం

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక చేస్తున్న తరుణంలో మొబైల్ యాప్ ప్రక్రియ సర్వర్ ప్రాబ్లం వస్తుండటంతో లబ్ధిదారుల వివరాలు యాప్‌లో నమోదు చేయడంలో ఆలస్యం జరుగుతోంది. పట్టణంలోని 36 వార్డులలో అధికారులు చేపడుతున్న సర్వేలో సర్వర్ సేవలు నిలిచిపోవడంతో సర్వే వేగంగా సాగడం లేదు. దీంతో పాటు దరఖాస్తుదారులు ఇంటి వద్ద కాకుండా మరోచోట ఉండడంతో వారికి ఫోన్ ద్వారా సమాచారం అందించి వివరాలు సేకరిస్తున్నారు. ఒక్కో అధికారి ప్రతిరోజు కనీసం 30 ఇళ్ల వివరాలు సేకరించాల్సి ఉంది కానీ సర్వర్ ప్రాబ్లంతో సుమారు 15వరకు మాత్రమే అవుతున్నాయి. సమాచారం యాప్‌లో దరఖాస్తుల దారుల వివరాలను నమోద చేసేందుకు ఒక్కొక్కరికి అరగంట కంటే ఎక్కువ సమయం పడుతోంది. ఈనెల 31వ తేదీ వరకు దరఖాస్తుల దారుల వివరాలను యాప్‌లో నమోదు కార్యక్రమం పూర్తి కావాల్సి ఉంది. కానీ సర్వర్ ప్రాబ్లంతో పొడిగించే పరిస్థితి కనిపిస్తోంది.

31లోపు సర్వే పూర్తి చేస్తాం



ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రభుత్వం విధించిన గడువులోపు పూర్తి చేస్తాం. దరఖాస్తుదారుల వివరాలను పక్కాగా సమాచారం సేకరించి యాప్‌లో నమోదు చేస్తున్నాం.

– రాజు, మున్సిపల్ కమిషనర్, ఆర్మూర్

అభివృద్ధిపై నిబద్ధత లేని కాంగ్రెస్ సర్కారు



పనులను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

ఆర్మూర్: కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిపై నిబద్ధత లేకపోవడంతో ఆలూరు బైపాస్ రోడ్డు అనాథగా మారిందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆలూరు బైపాస్ రోడ్డు, అక్కడ నిర్మించిన హైలెవల్ బ్రిడ్జిని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలూరు బైపాస్ రోడ్డు పొడవునా కరెంటు లైట్లు పెట్టడానికి కూడా మున్సిపల్ డబ్బులు లేవా? అని నిలదీశారు. గత ప్రభుత్వంలో చేపట్టిన పథకాలు, నిర్మాణాలపై నిర్లక్ష్యం తగదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆలూరు బైపాస్ రోడ్డును నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ఆలూరు బైపాస్ రోడ్డుపై శ్రద్ధ వహించి ప్రజలకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని జీవన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

బిల్లు రాక.. తారు వేయక..

- రూ.1.40కోట్లతో వంతెన నిర్మాణం
- రోడ్డుపై తారు వేయకుండా వదిలి వేసిన కాంట్రాక్టర్
- ఇబ్బందుల్లో వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

మోర్తాడ్: ఏర్గట్ల మండలం తొర్తి, మోర్తాడ్ మండలం పాలెం మధ్య ఉన్న మార్గంలో మినీ వంతెన నిర్మించి రోడ్డు వేసినా తారు వేయకపోవడంతో కంకర తేలి వాహనదారులకు ఇబ్బందిగా మారుతోంది. రూ.1.40 కోట్ల నిధులతో గత ప్రభుత్వ హయాంలో చెరువు కాలువపై వంతెన నిర్మించారు. వర్షాలు కురిసిన సమయంలో చెరువు నీరు రోడ్డుపై ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయేవి. ఒక్కోసారి రోడ్డు పూర్తిగా మునిగిపోయిన సందర్భాలు ఉన్నాయి. వంతెన నిర్మించడమే మేలు అని భావించి కల్వర్టు స్థానంలో వంతెన నిర్మాణం పూర్తి చేశారు. కానీ ఈ పనులు చేసిన కాంట్రాక్టరుకు బిల్లులు మంజూరు కాకపోవడంతో తారు వేయ కుండా అలాగే వదిలేశారు. తారు వేస్తేనే రోడ్డుపై కంకర తేలకుండా ఉండి రాకపోకలకు ఇబ్బంది ఉండదు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి రోడ్డుపై తారు వేయించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



తారు వేయకుండా వదలివేసిన తొర్తి, పాలెం రోడ్డు మార్గం

కోటగిరిలో సీపీఐ శతాబ్దిఉత్సవాలు



సీపీఐ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలో సీపీఐ శతాబ్ది ఉత్సవాలను గురువారం పార్టీ నాయకులు నిర్వహించారు. మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో సీపీఐ జెండాను ఆవిష్కరించారు. అనంతరం బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి దుబాస్ రాములు మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం జరిపిన ఘన చరిత్ర సీపీఐదేనని అన్నారు. ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం నిర్వహిస్తోందని పేర్కొన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఆదివాసీలు, మహిళలపై, మైనారిటీలపై దాడులు పెంచిందని విమర్శించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి పదేండ్లు దాటినా రాష్ట్ర పునర్విభజన చట్టంలో పేర్కొన్న హామీలు అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఎ విఠల్ గౌడ్, బి రాజు, రాములు, శివరాజు, శంకర్, హన్మాండ్లు, ఇమ్రాన్, నారాయణ, సాయిలు, హర్షద్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీర్ బాల్ దివస్



నివాళులు అర్పిస్తున్న నాయకులు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం బీజేపీ నాయకులు 'వీర్ బాల్ దివస్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా గురు గోవింద్‌సింగ్ కుమారులైన అజిత్‌సింగ్, జుగర్సింగ్, జొరావర్ సింగ్, ఫతే సింగ్‌ల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా కో కన్వీనర్, జిల్లా అధికార ప్రతినిధి కలిగోట గంగాధర్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి జెస్సు అనిల్ కుమార్, పట్టణ అధ్యక్షుడు ద్యాగ ఉదయ్, పాల్కం వేణు, పులి యుగేందర్, కర్తన్ మధు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఈడెన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదానం



మాక్లూర్: మండలంలోని మెట్టు గ్రామంలో గురువారం ఈడెన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఫౌండేషన్ ఏర్పడి పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక చర్చి పాస్టర్ రెవరెండ్ ప్లాంకిన్ చేతుల మీదుగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించినట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు కె ప్రసాద్‌రాజు తెలిపారు. శిబిరంలో 25 మంది యువకులు రక్తదానం చేశారని ఈ సేకరించిన రక్తాన్ని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సోమయ్య, డి సాయిలు, జి సురేశ్, అనిల్‌కుమార్, బి సురేశ్, ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మూతపడ్డ షుగర్ ఫ్యాక్టరీలను ప్రారంభించాలి

బోధన్ టౌన్: రాష్ట్ర ప్రభుత్వం మూతపడ్డ షుగర్ ఫ్యాక్టరీలను వెంటనే తిరిగి ప్రారంభించేలా చూడాలని జనతాదళ్(సెక్యులర్) పార్టీ జేడీఎస్ రాష్ట్ర కార్యదర్శి వాసు వడ్లూరి డిమాండ్ చేశారు. గురువారం బోధన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రి శ్రీధర్ బాబు నేతృత్వంలో మూతపడ్డ షుగర్ ఫ్యాక్టరీల పునరుద్ధరణ కోసం కమిటీని వేసిందని గుర్తుచేశారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీని తిరిగి పునఃప్రారంభించి కార్మికులను ఆదుకోవాలని కోరారు.

నియామకం



బోధన్‌టౌన్: ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా సంజయ్ పటేల్ ఎన్నికయ్యారు. సిద్దిపేటలో ఈ నెల 22 నుంచి 24 వరకు ఏబీవీపీ 43వ తెలంగాణ రాష్ట్ర మహాసభలు జరిగాయి. ఈ సభలో నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. కమిటీలో బోధన్‌లోని ఉషోదయ డిగ్రీ కళాశాల విద్యార్థి, ఏబీవీపీ సభ్యుడు సంజయ్ పటేల్‌కు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యాడు. సంజయ్ రాష్ట్ర కార్యవర్గంలో చోటు సంపాదించడంపై ఏబీవీపీ నాయకులు తలాండె ఈశ్వర్ కుమార్, ఇండ్ల సూర్య కుమార్, లక్ష్మణ్ చౌహాన్, కునాల్, బోధన్ నాయకులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు.

అయ్యప్ప ఆలయంలో మండల పూజ



మండల పూజలో పాల్గొన్న స్వాములు, భక్తులు



హోమం చేస్తున్న స్వాములు

బోధన్ టౌన్: పట్టణంలోని రాకాసిపేట్‌లోని అయ్యప్ప స్వామి ఆలయంలో గురువారం మండల పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వేద పండితులు, అయ్యప్ప ఆలయ ప్రధాన అర్చకుడు సంతోష్ శర్మ, శివాలయం ప్రధాన అర్చకుడు గణేశ్ మహరాజ్ వేద మంత్రాల మధ్య ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విశేష పూజా కార్యక్రమాలు జరిగాయి. సుప్రభాత సేవ, అభిషేకం, సహస్ర నామార్చన, గణపతి హోమం, విశిష్ట పూజా కార్యక్రమాలు చేపట్టారు. అయ్యప్ప స్వాములకు, భక్తులకు దాతలు భిక్ష కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం కన్నుల పండువగా అయ్యప్ప స్వామి పడిపూజ చేశారు. కార్యక్రమంలో అయ్యప్ప సేవా ట్రస్ట్ అధ్యక్షుడు శివన్నారాయణ, కార్యదర్శి ఐఆర్ చక్రవర్తి, కోశాధికారి కొయ్యాడ శ్రీనివాస్ గౌడ్, గురు స్వాములు, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

ముగిసిన విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు



నవీపేట: మండలంలోని నాగేపూర్‌లో వీడీసీ ఆధ్వర్యంలో నిర్మించిన రామాంజనేయ ఆలయంలో గురువారం దేవతా మూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. రెండు రోజుల క్రితం ప్రారంభమైన ఈ ఉత్సవాల్లో వివిధ గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వేడుకల్లో మల్లారం పీఠాధిపతి పిట్ల కృష్ణ మహరాజ్, లింగం గుట్ట పీఠాధిపతి సిద్ధేశ్వర మహరాజ్, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

రాంపూర్‌లో మహాలక్ష్మి విగ్రహ ప్రతిష్ఠాపన



మాక్లూర్: మండలంలోని రాంపూర్‌లో గురువారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మహాలక్ష్మి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ముందుగా విగ్రహాన్ని సంప్రదాయబద్ధంగా పూజించి గ్రామంలో ఊరేగింపు చేపట్టి నూతనంగా నిర్మించిన ఆలయంలో ప్రతిష్ఠించారు. ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు రఘు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎర్రోళ్ల శ్రీనివాస్ అరెస్టు అక్రమం

నిజామాబాద్ అర్బన్: ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ అరెస్టు అక్రమమని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోలీసులు శ్రీనివాస్‌ను అక్రమంగా అరెస్టు చేయడం తగదని, వెంటనే అతన్ని విడుదల చేయాలన్నారు. కుటుంబ సభ్యులకు కూడా కనీస సమాచారం ఇవ్వకుండా, ఎలాంటి నోటీసులు అందించకుండా ఎలా అరెస్టు చేస్తారని ప్రశ్నించారు. ఇది అప్రజాస్వామ్యకమని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నియంతలా వ్యవహరిస్తున్నారని అన్నారు. రాష్ట్ర పరువు, ప్రతిష్టలకు భంగం కలిగిస్తున్నారని పేర్కొన్నారు.

ఘనంగా కందాళై పుస్తకావిష్కరణ



నిజామాబాద్ రూరల్: ఇందూరు కవి కందాళైరాఘవాచార్య రచించిన విశ్వధ్యానం అనే యోగా ధ్యానం పుస్తక ఆవిష్కరణ గురువారం హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కొమాండూరు మోహనాచార్యులు, అధ్యక్షుడు రూప్‌కుమార్ డబ్బీకార్, అతిథులు కందుకూరి శ్రీరాములు, బెల్లంకొండ సంపత్ కుమార్ చేతుల మీదుగా పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇందూరు జిల్లా బాలసాహిత్య అధ్యక్షుడు డాక్టర్ కాసర్ల నరేశ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అపోహలు నమ్మొద్దు

నిజామాబాద్‌నాగారం: రక్తదానం విషయంలో ఉన్న అపోహలను నమ్మవద్దని, రక్తదానం చేసే వారు మరింత ఆరోగ్యవంతులవుతారని లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్ అధ్యక్షుడు అబ్బాయి లింబాద్రి అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్ ఆధ్వర్యంలో గురువారం నగరంలోని రెడ్‌క్రాస్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. లయన్స్ క్లబ్ సభ్యులు రక్తదానం చేశారు. క్లబ్ అధ్యక్షుడు మాట్లాడుతూ.. రక్తదానం ప్రాణదానమన్నారు. రక్తదానం చేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. రక్తదానంతో ఎంతో మందికి అత్యవసర సమయాల్లో ప్రాణదానం చేసినవారిమవుతామని అన్నారు. రక్తం ప్రాధాన్యత తెలిసి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో తరచూ రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ చైర్మన్ పి శ్రీనివాస్, ఇరుమల శివలింగం, చింతల గంగాదాస్, పి రాఘవేందర్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

28న రెండు పార్టీల విలీన సభ



గోడప్రతులను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆర్మూర్‌టౌన్: రాష్ట్రంలో సీపీఐఎంఎల్, న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభను ఈనెల 28న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్లు ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సూర్య శివాజీ పేర్కొన్నారు. పట్టణంలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో న్యూడెమోక్రసీ విలీన సభ పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీపీఐఎంఎల్, న్యూడెమోక్రసీ 2013 నుంచి రెండు విడిపోయినట్లు తెలిపారు. ప్రజల ఆకాంక్ష మేరకు ఒకే పార్టీగా ఏర్పడాలని భావించిందని అన్నారు. ఈనెల 28న పార్టీల ఐక్యత ప్రకటన చేయాలని విలీన సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు విలీన సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గులాం, వర్దరెడ్డి, నజీర్, హుస్సేన్, షాయబ్, వాజీద్ తదితరులు పాల్గొన్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1 –	లీగల్లీ వీర్(తెలుగు)-11.45 డ్రింకర్ సాయి(తెలుగు)-2.50 బేబీజాన్(హిందీ)-6.00 మార్క్స్(తెలుగు)-9.30
స్క్రీన్-2 –	మార్క్స్(తెలుగు)-10.40 1.35 7.15, శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్ (తెలుగు)-4.30 10.40
స్క్రీన్-3–	బేబీజాన్(హిందీ)-10.00 ముఫాసా(తెలుగు)- 1.30, 4.20 7.10, 10.00
స్క్రీన్-4	పుష్ప-2(తెలుగు) -10.05 2.10 6.15 10.20

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	మార్క్స్ (తెలుగు)-10.40 1.30 శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్ (తెలుగు) - 4.30, పుష్ప2 -7.00 బేబీజాన్(హిందీ)-10.40
స్క్రీన్-2	బేబీజాన్(హిందీ)-1.00 పుష్ప-2(తెలుగు)-4.00 యుఐ(తెలుగు)-7.40 మార్క్స్(తెలుగు)-10.20
స్క్రీన్-3	ముఫాసా(తెలుగు)3డీ-11.00 5.00 7.30, పుష్ప2-1.20, 10.00

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	పుష్ప-2(తెలుగు)-11.10 3.15 మార్క్స్(తెలుగు)-7.20 ముఫాసా(3డీ ఇంగ్లీష్)-10.15
స్క్రీన్-2	ముఫాసా(3డీ తెలుగు)-10.30, 1.20 7.30, బరోజ్-3డీ(తెలుగు) - 4.10 పుష్ప-2 (హిందీ)- 10.20
స్క్రీన్-3	బేబీజాన్(హిందీ)-11.00, 10.40 పుష్ప-2(హిందీ)-2.30 6.35
స్క్రీన్ -4	మార్క్స్(తెలుగు)-10.30, 10.50 డ్రింకర్ సాయి(తెలుగు)-1.25 శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్(తెలుగు)-4.35, బేబీజాన్(హిందీ)-7.20
లలితామహల్	యుఐ(తెలుగు)-11.15 2.15 విడుదల పార్ట్-2(తెలుగు)-6.15,9.15
దేవి	ముఫాసా(2డీ తెలుగు)-11.00, 2.15 6.10 10.10
నటరాజ్	మార్క్స్(తెలుగు)-11.00, 2.15, 6.10 10.10
విజయ్	పుష్ప2 -10.30 2.15 6.10 10.05

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	79,000	వెండి(కిలో)	93,000
22 క్యారెట్స్	73,500		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	180
		లైవ్	140
స్కిన్‌లెస్	220	మటన్	800